
శ్రీ లక్ష్మీ నృసింహ కరావలంబ స్తోత్రమ్(25)

(భావార్థముతో)



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

– – – === – – –

పూర్వాంగం...

శ్రీ శంకరాచార్యులు, మండనమిశ్రుల మధ్య జరిగిన వాదములో మండనమిశ్రుడు పరాజయం పొందెను. తన భర్త పక్షమున తాను వాదింతునని, తనను కూడ ఓడించిన తర్వాతనే విజయం పొందునట్లగునని ఉభయభారతి ప్రకటించెను. వారివురి వాదన ప్రారంభమయ్యెను. ఆ వాదనలో ఉభయభారతి కామశాస్త్ర ప్రసంగము దెచ్చెను. అందుకు శంకరులు 30 రోజులు గడువు కోరి, ఒక గుహలో పడుకొని, తాను తిరిగి వచ్చువరకు తన శరీరమును సంరక్షించమని తన శిష్యుడు పద్మపాదుని కోరి, అప్పుడే మరణించిన అమరశేన మహారాజు శరీరములో పరకాయ ప్రవేశము చేసి కామశాస్త్ర జ్ఞానమును పొందిరి. రాజు శరీరములో శంకరులున్నట్లు గ్రహించిన మంత్రులు శంకరులను రాజు శరీరము లోనే ఉంచుటకుగాను శంకరుల శరీరము వెదికించి చితిమీదవుంచి నిప్పంటిచిరి. ఈ విషయం తెలుసుకున్న శంకరులు రాజు శరీరము విడిచి చేతులుకాలిన తన శరీరములో ప్రవేశించిరి.

ఆ సందర్భంలో శంకరులు శ్రీ లక్ష్మీనరశింహస్వామిని స్తోత్రము చేసి శ్రీ లక్ష్మీనరశింహస్వామి వారి కటాక్షముతో కాలిన చేతులు తిరిగి పొందిరి. ఆ స్తోత్రమే ఈ “లక్ష్మీనృశింహ కరావలంబ స్తోత్రమ్”.

– – – === – – –

Kiron Type Institute

శ్రీ లక్ష్మీ నృసింహ కరావలంబ స్తోత్రమ్ (25)

01. శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే
భోగీంద్ర భోగ మణిరా(రం)జిత పుణ్యమూర్తే।
యోగీశ శాశ్వత శరణ్య భవాబ్ధిపోత
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

శ్రీ మంతమగు క్షీరసాగరమున శేషతల్పముపై, ఆదిశేషుని పడగల పై నున్న రత్నముల కాంతులచే విరాజిల్లు దివ్య దేహము కలవాడా! భక్తరక్షణలో సదా జాగరూకుడవై కరమున సుదర్శన చక్రము దాల్చినవాడా! యోగీశ్వరా! నాశరహితుడా! దీనులపాలిటి దిక్కైనవాడా! సంసారసాగరము దాటించు తెప్పయైనవాడా! లక్ష్మీ నృసింహస్వామీ! నాకు నీ చేయూతను నిమ్ము.

శ్రీమంతమైన పాలసముద్రము నందుండు వాడా! చక్రపాణీ! యోగీశ్వరుడా! శాశ్వతుడా! శరణు పొందగినవాడా! సంసార సముద్రము దాటించు నౌకయైనవాడా! ఓ లక్ష్మీ నారసింహా! నాకు చేయూతనిమ్ము.

క్షీరసాగరములో ఆదిశేషునిపై ఉన్న రత్నముల కాంతిచే వెలుగుతూ, భక్త రక్షణకై సుదర్శన చక్రమును దాల్చి దీనులకు దిక్కై, సంసార సాగరములో నావ అయిన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

సుదర్శనచక్రమును చేతబట్టుకొని, విలాసముగా నాదిశేషుని శరీరమను పాన్పునందు పవళించి అతని తలలయందలి రత్నములచే ఒడలెల్ల మెరయ, సొగసుమీరగా ఉన్న ఓ స్వామీ! యోగులకు ధ్యానింపదగిన వాడా! ఓ నాశరహితుడా! దీనులపాలిటి దిక్కైన ఓ స్వామీ! సంసార సముద్రమును గడప ఓడయగువాడా! ఓ లక్ష్మీనృసింహస్వామీ! నాకు చేయూత నిమ్ము.

02. బ్రహ్మేంద్ర రుద్ర మరుదర్క కిరీటకోటి
సంఘట్టితాంఘ్రి కమలామల కాంతికాంత।
లక్ష్మీలసత్కుచ సరోరుహరాజహంస
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

బ్రహ్మ, ఇంద్రుడు, శివుడు, వాయువు, సూర్యుడును నీ పాదముల చెంత శిరము వంచి ప్రణమిల్లగా, వారి కిరీటములు నీపాదపద్మములు నొరసికొనగా శుద్ధమైన కాంతితో విరాజిల్లువాడా! ప్రకాశించు కుచములను తామర మొగ్గలకు రాజహంస యైనవాడా! లక్ష్మీ నృసింహస్వామీ! నాకు నీ చేయూత నొసగుము.

బ్రహ్మ, ఇంద్రుడు, రుద్రుడు, మరుత్తులు, సూర్యుడు, మొ॥ దేవతలు ప్రణమిల్లగా వారి కిరీటములు ఒరుసుకొనుచున్న పాదపద్మములకాంతితో రమణీయమైనవాడా! లక్ష్మీదేవి స్తనపద్మములందు విహరించు రాజహంసమా! ఓ లక్ష్మీనారసింహా! నాకు చేయూతనిమ్ము.

బ్రహ్మ, ఇంద్ర, వాయు, సూర్యులు వారి కిరీటములు నీ పాదములను తాకునట్లు శిరసు వంచి నమస్కరించగా, తామర పుష్పములను వక్షమున ధరించిన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

బ్రహ్మ, ఇంద్రుడు, ఈశ్వరుడు, వాయువు, సూర్యుడు వీరి కిరీటముల యొత్తిడిగల పాదముల చక్కని కాంతిగలవాడా! లక్ష్మీదేవి యొక్క ప్రకాశించుచున్న చనుతామర మొగ్గలకు రాజహంసమైన వాడా! ఓ లక్ష్మీనృసింహస్వామీ! నాకు చేయూత నిమ్ము.

03. సంసారసాగర విశాల కరాళకా(ల)మ (9)(5)
నక్రగ్రహ గ్ర(సిత)సన నిగ్రహ విగ్రహస్య।
మగ్నస్య రాగలసదూర్మి నిపీడితస్య

(వ్యగ్రస్య రాగనిచయోర్మి నిపీడితస్య)
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

సంసారమను సాగరమున అతి పెద్దదైన, భయంకరమైన మొసలివంటి కామగ్రహము నన్ను మ్రింగ చూచు చున్నది. ఈ రాగపీడనము నుండి బయటపడుటకు లక్ష్మీనృసింహా! నీ చేయూత నొసగుము.

సంసారమనే సముద్రములోని భయంకరమైన పెద్ద మొసళ్ళు నా నిగ్రహమును మింగగా కలతచెందినవాడను, మమకారమనే అలలచే పీడింపబడుచున్నవాడను అయిన నాకు ఓ లక్ష్మీ నారసింహా! చేయూత నిమ్ము.

సంసార సాగరంలో భయంకరమైన మొసలి రూపంలో – కామము అనే గ్రహం నన్ను మ్రింగాలని చూస్తున్నది. దీనినుండి రక్షించుటకు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

ఓ లక్ష్మీనృసింహ స్వామీ! సంసారమను సముద్రమందలి భయంకరమైన కామమను పెద్ద మొసలిచే చిక్కుపడినవాడనై విషయ చింతలను అలలచే వెనకకు ముందునకు గుంజబడి భాదల నొందుచున్న నాకు ఆధారము అగుము.

04. సంసారఘోరగహనే చరతో మురారే (11)(3)
మారోగ్రభీకర మృగప్ర(చు)వరార్దితస్య।
ఆర్తస్య మత్సర నిదాఘ (సుదుఃఖితస్య)నిపీడితస్య
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

మురారీ! సంసార మను ఘోరాటవిలో తిరుగుచు, మన్మథుడను క్రూరమృగమునకు చిక్కి బాధితుడనై, దీనుడనై, ఈర్ష్య గ్రీష్మముచే చిక్కి శల్యమైతిని. లక్ష్మీనృసింహా! నాకు నీ చేయూత నొసగుము.

సంసారమనే ఘోరమైన, దారి తెలియని అడవిలో సంచరించుచూ, కామములనే భయంకర మృగములచే పీడింపబడుచూ, మాత్సర్యమనే వడగాడ్పు వలన తపించుచూ దుఃఖించు నాకు ఓ మురారీ! లక్ష్మీ నారసింహా! చేయూతనిమ్ము.

సంసారమనే అరణ్యంలో తిరుగుతూ, మన్మథుడనే మృగానికి చిక్కి బాధతో అల్లాడుతున్న నన్ను రక్షించుటకు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

ఓ మురారీ! సంసారమను కారడవి యందు బడి తిరుగుచు మన్మథుండను నీ క్రూర మృగము వాతబడి బాధ నొందుచున్నవాడను, క్రోధమను గ్రీష్మముచే పీల్చబడుచున్న నాకు ప్రాపగుము.

05. సంసారకూప మతిఘోర మగాధమూలం (5)(4)
సంప్రాప్య దుఃఖ శతసర్ప సమాకులస్య,
దీనస్య దేవ కృపయా శరణాగతస్య
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

లక్ష్మీనృసింహా! మిక్కిలి భయము గొలుపుచు, మిక్కిలి లోతైన సంసారమను నూతిలోపడి కష్టములను వందలాది సర్పములచే పీడింపబడి, దీనుడనై నిన్ను శరణుజొచ్చితిని. నాకు దయతో నీ చేయూత నిమ్ము.

అతిఘోరమైన, అంతులేని లోతుగల సంసారకూపములో పడి, దుఃఖములనే వందలకొలది పాపములచే చుట్టుముట్ట బడి నీ పాదములు చేరిన దీనుడనైన నాకు ఓ దేవా! లక్ష్మీ నారసింహా! చేయూతనిమ్ము.

భయంకరమైన విషసర్పాలతో కూడిన సంసారమనే సాగరములో చిక్కి నిన్ను శరణు వేడుచున్న నాకు, శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

ఓ లక్ష్మీనృసింహా! మిగుల భయంకరమై, చాలా లోతుగల సంసారమను నూతిలోబడి దుఃఖములను పాములకు చిక్కి కలవరము నొందిన కృపణుండగు నన్ను కరుణించి చేయూత నిచ్చి లేవదీయుము.

06. సంసారభీకర కరీంద్ర కరాభి ఘాత (6) (10)
నిష్పీడ్యమానవపుషః (సకలార్తినాశ)సకలార్థితస్య।

ప్రాణప్రయాణ భవభీతి సమాకులస్య
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

సంసారమను మత్తగజేంద్రము తన తొండముతో నా యొడలెల్ల నొచ్చినది. సర్వవిధములగు వేదన లనుభవించు చున్నాను. ప్రాణములు పోవునను తలంపు నాకు భయభ్రాంతులు కలిగించి, మనస్సు అశాంతికర మగుచున్నది. ఓ లక్ష్మీనృసింహ! దయతో నాకు నీ చేయూత నిమ్ము.

సమస్త దుఃఖములను నశింపచేయు ఓ లక్ష్మీ నారసింహా! సంసారమనే భయంకరమైన మదపుటేనుగు తొండము దెబ్బలచే నలిగిపోయిన, మరణ భయముచే వ్యాకులచిత్తుడనైన నాకు చేయూత నిమ్ము.

సంసారమనే మత్త గజము తన తొండముతో నన్ను బాధించు చున్నది. అశాంతి, భయము నన్ను అలముకున్నవి. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

లక్ష్మీనృసింహ స్వామీ! సంసారమను భయంకరమైన మదపుటేనుగు తొండపు దెబ్బలచే నొచ్చిన మేనుగలవాడను, సమస్త బాధలచే గృశించినవాడను, ప్రాణాపదవలన నైన భయముతో కూడుకొనినవాడను నగు నాకు జేయూత యొసంగుము.

07. సంసార సర్ప (విషదగ్ధ మహోగ్రతీవ్ర)విషదుష్ట భయోగ్రతీవ్ర
దంష్ట్రాకరాళ విషదగ్ధ (దంష్ట్రాగ్రకోటి పరిదష్ట)వినష్టమూర్తేః
నాగారివాహన సుధాబ్ధినివాస శౌరే (7)(7)
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

గరుడవాహనా! క్షీరాబ్ధిశయనా! పరాక్రమవంతా! లక్ష్మీనృసింహా! విషముతో నిండి, భీకరములై వాడియైన కోరలుగల సంసారమను విషసర్పము నన్ను కాటు

వేయగా, దాని కోరలలోని విషముచే నారూపమే మారిపోయినది. లక్ష్మీనృసింహా! నాకు నీచేయూత నొసగుము.

సర్పములకు శత్రువైన గరుడుడు వాహనముగా కలవాడా! అమృత సాగరము నందు నివశించు వాడా! లక్ష్మీ నారసింహా! సంసారమనే సర్పము యొక్క మహోగ్రములైన, విషముతో నిండిన కోరలచే కరవబడి క్షీణించుచున్న నాకు చేయూత నిమ్ము.

వాడి కోరల నిండా విషముతో సంసారమనే సర్పము నన్ను కాటు వేయుచున్నది. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

ఓ గరుడవాహనుడా! పాలసముద్రమున పవళించు స్వామీ! శూరుడు అనువాని మనుమడగు ఓ లక్ష్మీనృసింహ స్వామీ! సంసారమను త్రాచుపాము యొక్క విషముచే దుష్టములై, భయంకరములై, క్రూరములై, తీక్ష్ణములైన కోరల యందలి భీషణమయిన విష సంపర్కముచే నశించిన శరీరము గల నాకు చేయూత ఒసంగుము.

08. సంసారజాలపతితస్య జగన్నివాస (4) (9)
సర్వేంద్రియార్థబడి(శార్థ)శస్థ ఝషాత్మనశ్చ।
ప్రో(త్థండిత)(త్కంపిత)త్తంభిత ప్రచుర తాలుక మస్తకస్య
లక్ష్మీనృసింహా! మమ దేహి కరావలంబమ్।

జగమందంతటను అంతర్యామివై విల్లసిల్లు లక్ష్మీనరసింహాస్వామి! నేను సంసారమను వలలో తగులుకొని సర్వేంద్రియ విషయములను గాలమున చిక్కి నోరు తెరచి, తలయెత్తిన చేప తెరగున ఉన్నాను. లక్ష్మీనృసింహా! నాకు నీ చేయూత నొసగుము.

సంసారమనే వలలో పడి, ఇంద్రియ సుఖములనే గాలమునకు చిక్కిన చేప వలే ఉన్న, దవడలు వణుకుచూ, తలతిరుగుచున్న నాకు ఓ జగన్నివాసా! లక్ష్మీ నారసింహా! చేయూతనిమ్ము.

కోరికలనే గాలమునకు చిక్కి, సంసారమనే వలలో ఇరుక్కుని, విలవిలలాడుచున్న చేపవలే ఉన్నాను. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

సర్వలోకాంతర్యామివగు ఓ లక్ష్మీనృసింహ స్వామీ! సంసారపు చిక్కులమారి వలలో తగులుకొని స్త్రీగంధాది విషయములకు లోనై వలలోని చేపమాదిరి తన్నుకొను చున్నవాడను. ఎత్తబడినదియు తెరవబడిన దవడలు తలయు గల నాకు చేయూత నిచ్చి దయతో కాపాడుము.

09. సంసారవృక్ష మఘబీజ మనంతకర్మ (8) (6)
శాఖాయుతం కరణపత్ర మనంగ పుష్పమ్।
ఆరుహ్య దుఃఖ (ఫలినం)జలధౌ పతతో దయాళో
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

దయాన్వితుడవగు లక్ష్మీనృసింహస్వామి! సంసార మొక ద్రూనువంటిది. పాపము దీని విత్తు. అంతులేని దుష్కృత్యములు దాని కొమ్మలు. ఇంద్రియములే ఆకులు. మన్మథుడు పూవు. ఇట్టి సంసార వృక్షము నెక్కి, శోక సాగరమున పడుచున్న నాకు లక్ష్మీనృసింహా! నీ చేయూత నొసగుము.

పాపమే బీజముగా, అంతులేని కర్మలే కొమ్మలుగా, ఇంద్రియములే ఆకులుగా, కామములే పుష్పములుగా, దుఃఖములే ఫలములుగా కల సంసార వృక్షమునెక్కి బాధపడుచున్న నాకు దయామయుడవైన ఓ లక్ష్మీ నారసింహా! చేయూత నిమ్ము.

పాపమనే విత్తనముతో, చెడు కార్యములు కొమ్మలుగా, ఇంద్రియములు ఆకులుగా, మన్మథుడు పుష్పముగా ఉన్న మానువంటి సంసారము పైనుండి దిగలేక ఉన్నాను. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

స్వామీ! పాపమువలన బుట్టి పెరిగి, పాపకర్మలను కొమ్మలతో కూడి, ఇంద్రి యములను ఆకులుగలిగి, మన్మథుండను పూవు గలిగిన యీ చెడు సంసారమను చెట్టెక్కి సంసార సముద్రములో బడిన నన్ను చేయూత నిచ్చి లేవనెత్తుము.

10. సంసార దావదహనాతుర(కర)(కుల) భీకరో(గ్ర)రు-
జ్వాలా వళీభి రతి(భి)దగ్ధ తనూరుహస్య।
త్వత్పాదపద్మ సరసీం శరణాగతస్య(సరసీరుహ మాగతస్య)
(త్వత్పాదయుగ్మ సరసీరుహ మస్తకస్య) (3) (8)
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

సంసారమను దావానల మన్నివైపులను విస్తరించి యుండగా దాని భీకరజ్వాలల మధ్య చిక్కి రోమములు తగలబడుచుండగా నీ పాద పద్మముల చెంత శిరము వంచి ప్రణమిల్లిన నాకు లక్ష్మీనృసింహా! నీ చేయూత నొసగుము.

సంసారమనే దావాగ్నియొక్క భయంకర జ్వాలలచే దహించబడి నీ పాద పద్మములు ఆశ్రయించిన నాకు ఓ లక్ష్మీ నారసింహా! చేయూత నిమ్ము.

సంసారమనే దావాగ్ని జ్వాలల మధ్య చిక్కి శరీరము తగులబడుచుండగా నీ పాద పద్మములకు ప్రణమిల్లుచున్నాను. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

ఓ లక్ష్మీ నృసింహస్వామీ! సంసారమను కార్చిచ్చు యొక్క, అన్నివైపుల చుట్టి వచ్చుచున్న భయంకరములై క్రూరములైన మంటలచే మాడిపోయిన రోమములు గల వాడనై; నీపాదములను శిరమునదాల్చి ధ్యానించుచున్న నాకు చేయూత యొసంగి దిక్కగుము.

11. సంసార సాగర నిమజ్జన ము(మ)హ్యమానం (10)
దీనం విలోకయ విభో కరుణానిధే మామ్। (15)

ప్రహ్లాదఖేద పరిహార పరావతార
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

ప్రభూ! దయానిధీ! కేవలం ప్రహ్లాదుని క్లేశములు తొలగించుటకై అవతరించిన స్వామీ, సంసారమున మునిగి మూర్ఛిల్లుతున్న నాకు లక్ష్మీనృసింహా! నీ చేయూత నొసగుము.

ఓ ప్రభూ! కరుణానిధీ! సంసార సాగరములో మునిగి మూర్ఛిల్లిన దీనుడనైన నన్ను చూడుము. ప్రహ్లాదుని దుఃఖమును తొలగించుటకు అవతార మెత్తిన ఓ లక్ష్మీ నారసింహా! నాకు చేయూతనిమ్ము.

ప్రహ్లాదుని కరుణించడానికి అవతరించిన స్వామీ, సంసారములో మునిగి మూర్ఛిల్లుతున్నాను. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

దయగల ఓ దొరా! ప్రహ్లాదుని గాచిన ఓ అయ్యా! శ్రేష్ఠములైన అవతారములు గలవాడా! ఓ లక్ష్మీనృసింహా! సంసారసముద్రమునబడి ఉక్కిరిబిక్కిరి అగుచున్న దిక్కులేని నన్ను కాపాడుము. స్వామీ! నాకు చేయి అందిమ్ము.

12. సంసార యూథ గజసంహతి సింహదంష్ట్రా
(సంసార భీకర కరీంద్ర కరాభిఘాత)
భీతస్య దుష్టమతిదైత్య భయంకరేణ।
(నిష్పీడ్యమానవపుషః సకలార్తినాశ।)
ప్రాణప్రయాణ భవభీతి (సమాకులస్య)నివారణేన
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

సంసార మను గజయూథపు భీకరములగు కోరలకు భయపడినవాడను, ప్రాణాపాయమునకు వెరచినవాడను. దుష్టరాక్షసులకు భయంకరమగు నీ దివ్యమంగళ స్వరూపమును ప్రదర్శించి నాభయమును పారద్రోలి, లక్ష్మీనృసింహా! నాకు నీ చేయూత నొసగుము.

సమస్త దుఃఖములను నశింపచేయు ఓ లక్ష్మీ నారసింహా! సంసారమనే భయంకరమైన మదపుటేనుగు తొండము దెబ్బలచే నలిగిపోయిన, మరణ భయముచే వ్యాకులచిత్తుడనైన నాకు చేయూత నిమ్ము.

సంసారమనే గజమునకు - సింహరూపుడవై, రాక్షసులకు నీ భయంకర రూపమును చూపి నా భయమును పోగొట్టుము. శ్రీ లక్ష్మీ నృసింహా స్వామీ నాకు చేయూతనిమ్ము.

ఓ లక్ష్మీనృసింహా! సంసారమను మంద యేనుగుల వాడికోరలకు భయపడి నీ యండజేరిన నాకు పాపిరక్కసులకు భయావహమైనదియు, ప్రాణాపాయమందలి భయమును పోగొట్టి నీ దివ్య మంగళరూపముతో కన్పించి చేయిచ్చి లేవనెత్తుము.

13. సంసారయోగి సకలేప్సిత నిత్యకర్మ
సంప్రాప్య దుఃఖ సకలేంద్రియ మృత్యునాశ
సంకల్ప! సింధుతనయా కుచకుంకుమాంక!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

సంసార బంధముచే కలిగిన కోర్కెలు ప్రేరేపింపగ ఆచరించిన వివిధ కర్మలకు ఫలములైన దుఃఖములను, ప్రేరకములైన సకలేంద్రియ విషయములను, మృత్యువును కూడ సంకల్పమాత్రముననే పటాపంచలు చేయువాడా! లక్ష్మీనృసింహా! నీ చేయూత నొసగుము.

సంసారబంధమనే కోర్కెల వలన చేసిన కర్మ ఫలితములైన దుఃఖమును, మృత్యువును నీవు పటాపంచలు చేయగలవు. శ్రీ లక్ష్మీ నృసింహా స్వామీ నాకు చేయూతనిమ్ము.

ఓ లక్ష్మీనృసింహస్వామీ! సంసారముతో సంబంధముగల సకల కామముల వలన పుట్టి నిత్యములైన కర్మ బంధములచే పొందబడు దుఃఖములను సమస్తములైన ఇంద్రియార్థముల (స్రక్చందనాదుల) ను, మృత్యువును నశింపజేయు

దివ్య సంకల్పము గలవాడా! లక్ష్మీదేవి స్తనములయందలి కుంకుమపొడిచే నలంకరింపబడినవాడా! ఓ లక్ష్మీనృసింహ స్వామీ! నాకు జేయూత నిమ్ము.

14. బద్ధ్వా కశైర్యమభటా బహు భర్త్సయంతి (12) (12)
(బద్ధ్వాగలే యమభటా బహు తర్జయంతః)
కర్షంతి(కర్తంతి) యత్ర పథి పాశశతైర్యదా మామ్।
(కర్షంతి యత్ర భవ పాశశతైర్యుతం మామ్।)
ఏకాకినం పరవశం చకితం దయాళో
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

నేనొంటరినై, ఇంద్రియ పరువశుడనై, భీతిలియుండగా యమకింకరులు నన్ను పాశములతో కట్టి, కొరడాలతో బెదిరించి నన్నెటు కీడ్చెదరో, అచ్చట ఆసమయమున నాకు కృప చూపుము.

సంసారబంధములో చిక్కి, ఏకాకినై, పరాధీనుడనై, భయపడుచున్న నన్ను యమభటులు బెదిరించుచూ మెడకు తాడుకట్టి ఈడ్చుకు పోవునప్పుడు ఓ దయామయా! లక్ష్మీ నారసింహా! నాకు చేయూత నిమ్ము.

ఇంద్రియ లోలుడనైన నన్ను యమ భటులు తమ పాశములు వేసి, కొరడాలతో కొట్టుచూ, ఈడ్చు వేళ శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

దయామయుడవగు ఓ లక్ష్మీనృసింహస్వామీ! ఎప్పుడు నన్ను యమకింకరులు దిక్కు మాలిన వానిగా జూచి, పరవశుండనై భయముంజెంది యుండగా ఎచ్చట బట్టి ఈడ్తురో అచ్చోట ఆ సమయమున పొడసూపి నాకు చేయూత నిమ్ము.

15. అంధస్య మే హృతవివేక మహాధనస్య (15) (11)
చోరై ర్మహాబలిభి రింద్రియ నామధేయైః

మోహాంధకార (నివహే)కుహరే వినిపాతితస్య
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

విషయవాసనలలో తగులుకొని, గ్రుడ్డివాడనై, మహా బలము కల 'ఇంద్రియములను చోరులు' నా వివేకము నపహరింపగా దారి తప్పి, అజ్ఞాన మను చీకటి నిండిన గుహలోని కి త్రోసివేయబడిన నాకు లక్ష్మీనృసింహా! నీ చేయూత నొసగుము.

తత్వమును తెలుసుకోలేని గుడ్డివాడనైన నాయొక్క వివేకమనే మహాధనమును ఇంద్రియములనే మహాబలవంతులైన దొంగలు అపహరించి, నన్ను అజ్ఞాన మనే గాఢాంధకారములో పడత్రోసిరి. ఓ లక్ష్మీ నారసింహా! నాకు చేయూత నిమ్ము.

విషయ వాసనలలో చిక్కుకుని ఇంద్రియములు అనే దొంగలు నా వివేకమును పోగొట్టగా అజ్ఞానమనే గుహలో నెట్టివేయబడ్డాను. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

ఓ లక్ష్మీనృసింహా! బలవంతులైన ఇంద్రియములను దొంగలు – రాగాదులచే గ్రుడ్డివాడనైనందున – నా వివేకమును, కలిమి నంతయు దోచుకొని అజ్ఞాతపు కోనలో పడనెట్టిరి. నాకు చేయిచ్చి నన్ను కాపాడుము.

16. లక్ష్మీపతే కమలనాభ సురేశ విష్ణో 13. (13)
యజ్ఞేశ యజ్ఞ మధుసూదన విశ్వరూప।
(వైకుంఠ కృష్ణ మధుసూదన పుష్కరాక్ష)
బ్రహ్మణ్య కేశవ జనార్దన వాసుదేవ
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్।

లక్ష్మీపతివి, నాభియందు తామరపూవు కలవాడవు, దేవతలలో ఉత్తమమైనవాడవు, విశ్వమంతయు నీ రూపముగ కలవాడవు. బ్రాహ్మణులకు

మేలు చేయువాడవు, త్రిమూర్తివి, ప్రళయకాలమున దుష్టులను శిక్షించువాడవు, లోకాధారుడ వగు ఓ లక్ష్మీ నృసింహా! నాకు నీ చేయూత నొసగుము.

ఓ లక్ష్మీపతీ! పద్మనాభా! దేవనాయకా! విష్ణుమూర్తీ! యజ్ఞరక్షకుడా! యజ్ఞ స్వరూపుడా! మధుసూదనా! విశ్వరూపుడా!, బ్రహ్మనిష్ఠుడా! కేశవా! జనార్దనా! వాసుదేవా! లక్ష్మీ నారసింహా! నాకు చేయూత నిమ్ము.

నీవు లక్ష్మీపతివి. కమలనాభుడవు. విశ్వవ్యాప్తుడవు. దుష్ట శిక్షకుడవు. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

లక్ష్మీపతే! బొడ్డున తామరగల యో స్వామీ! ఓ దేవదేవుడా! ఓ సర్వ వ్యాపకుడా! ఓ యజ్ఞ పురుషుడా! ఓ యజ్ఞ రూపుడా! ఓ మధుదైత్య మథనా! ఓ సర్వ ప్రపంచ రూపుడా! ఓ బ్రాహ్మణ ప్రియుడా! ఓ జనార్ధనా! ఓ వాసుదేవా! ఓ లక్ష్మీనృసింహా! నాకు జేయూత నిమ్ము.

17. ప్రహ్లాద నారద పరాశర పుండరీక (16) (16)
వ్యాసాంబరీష శుక శౌనక హృన్నివాస।
(వ్యాసాది భాగవతపుంగవ హృన్నివాస।)
భక్తానురక్త పరిపాలన పారిజాత
లక్ష్మీనృసింహా! మమ దేహి కరావలంబమ్॥

ఓ లక్ష్మీనృసింహ స్వామీ! నీవు ప్రహ్లాదుడు, నారదుడు, పరాశరుడు, అంబరీషుడు, శుకుడు, శౌనకుడు మొదలగు మహాభాగవతోత్తముల హృదయములందు నివసించువాడవు. నీయందనురక్తులగు భక్తులను పరి రక్షించుటలో కల్పవృక్షమైన వాడవు. లక్ష్మీనృసింహా! నీ చేయూత నొసగుము.

ప్రహ్లాదుడు – నారదుడు – పరాశరుడు –పుండరీకుడు – వ్యాసుడు మొదలైన భక్తశ్రేష్ఠుల హృదయాలలో నివసించు వాడా! భక్తులను పాలించు కల్పవృక్షమా! ఓ లక్ష్మీ నారసింహా! నాకు చేయూత నిమ్ము.

నీవు ప్రహ్లాద, నారద, పరాశర, పుండరీక, అంబరీష, శుక, శౌనకాది భాగవతోత్తముల హృదయములలో వసించువాడవు. భక్తులకు కల్పవృక్షము వంటి వాడవు. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

ప్రహ్లాదుడు మొదలగు పరమభాగవతోత్తముల హృదయ సీమలయందు ఎడతెగక ఉండువాడా! అంతరంగ భక్తులను గాపాడు కల్పవృక్షమా! ఓ లక్ష్మీనృసింహా! నన్ను చేయిబట్టి లేవదీయుము.

18. ఏకేన చక్ర మపరేణ కరేణ శంఖ 14. (14)
మ(అ)న్యేన సింధుతనయా మవలంబ్య తిష్ఠన్,
వామేతరేణ వరదాభయ హస్తముద్రాం
లక్ష్మీనృసింహా! మమ దేహి కరావలంబమ్॥

ఓ లక్ష్మీనృసింహస్వామీ! నీవు ఊర్ధ్వ బాహుద్వయముచే శంఖ చక్రములను, క్రింది ఎడమ చేతితో లక్ష్మీదేవిని, కుడిచేత వరదముద్రను, అభయముద్రను దాల్చి నిలచినవాడవై నాకు చేయూత నిమ్ము.

ఒక చేతితో చక్రమును, వేరొకచేతితో శంఖమును, మరొక చేతితో లక్ష్మీదేవిని పట్టుకొని, వరదం – అభయం – పద్మ చిహ్నములు ధరించిన కుడిచేతితో లక్ష్మీ నారసింహా! నాకు చేయూతనిమ్ము.

నీవు పై బాహువులతో శంఖ చక్రములను, క్రింది ఎడవ చేతితో లక్ష్మీదేవిని, కుడిచేత అభయ వర ముద్రను ధరించినవాడవు. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

ఓ లక్ష్మీనృసింహా! ఒక చేతితో చక్రమును, మరియొక చేత శంఖమును, వేరొక యెడమ చేత లక్ష్మిని, ఇంకొక కుడిచేత అభయప్రదమైన వరదానముద్రను దాల్చిన దివ్యరూపముతో దర్శనమిచ్చి నన్ను ఉద్ధరించుము.

19. ఆద్యంతశూన్య మజ మవ్యయ మప్రమేయ
మాదిత్యరుద్ర నిగమాది నుత ప్రభావమ్,
త్వాంభో ధిజాస్య! మధులోలుప మత్తభృంగం
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥

ఓ లక్ష్మీనృసింహస్వామీ! నీవు అనాదివి, అనంతుడవు, జనన మరణ రహితుడవు, అమేయమహిముడవు, నీ మహిమను సూర్యుడు, శివుడు, వేదములు, మరియు పెక్కంద్రు కొనియాడుచుందురు. లక్ష్మీనృసింహా! నీ చేయుత నొసగుము.

నీవు ఆది అంతములు, జనన మరణములు లేని మహిమాన్వితుడవు. నీ మహిమను సూర్యుడు, శివుడు, వేదములు కొనియాడుచుండును. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

లక్ష్మీనృసింహా! తుద మొదలు లేని వాడవును, పుట్టుక లేని వాడవును, నాశములేని వాడవును, పరిమాణముచేయ శక్యము కానివాడవును, సూర్యుడు, ఈశ్వరుడు సర్వ వేదములు మొదలగు వారిచే గొనియాడబడిన సామర్థ్యము గలవాడవును, లక్ష్మీదేవియొక్క మోము తమ్మియందలి మకరందమును గ్రోలు మత్తభ్రమరమైన నిన్ను సేవించెదను. నాకు దిక్కు అగుము.

20. వారాహ రామ నరసింహ రమాదికాంతా
క్రీడా విలోల విధిశూలి సుర ప్రవంద్య।
హంసాత్మకం పరమహంస విహారలీలం
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥

వరాహా, రామ, నృసింహాది రూపములు దాల్చినవాడా! పరమహంసరూపుడవు. పరమహంసల హృదయవర్తివగు నిన్ను సేవింతును. లక్ష్మీనృసింహా! నీ చేయూత నొసగుము.

వరాహ, రామ, నృసింహాది రూపములు ధరించినవాడవైన నీవు పరమ హంస రూపుడవు. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

వరాహాది అవతారములను దాల్చినవాడా! లక్ష్మీ మొదలగు ఉత్తమ కాంతలతో క్రీడింప గోరువాడా! బ్రహ్మేంద్రాదులచే నమస్కరింప దగినవాడా! పరమ హంస రూపుండవును, పరమహంస యోగులయొక్క చిత్తములయందు మెలగు నిన్ను ధ్యానించుచున్న నాకు చేయినిచ్చి లేవదీయుము.

21. మాతా నృసింహశ్చ పితా నృసింహః
భ్రాతా నృసింహశ్చ సఖా నృసింహః।
విద్యా నృసింహో ద్రవిణం నృసింహః
స్వామీ నృసింహః సకలం నృసింహః

నా తల్లి, తండ్రి, తోబుట్టువు, మిత్రుడు, విద్య, ధనము, రక్షకుడు ఒకటియేల సమస్తమును నాకు నీవే.

నాకు తల్లి, తండ్రీ, సహోదరుడు, స్నేహితుడు, ఐశ్వర్యము, రక్షకుడు, వేయేల సమస్తము నీవే శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

నాకు తల్లి, తండ్రి నృసింహ స్వామియే. తోడబుట్టినవాడు, మిత్రుడు నృసింహ స్వామియే. చదువు, ధనము, రక్షకుడు నృసింహ స్వామియే. నా జీవితమందలి సర్వము నృసింహ స్వామియే.

22. ప్రహ్లాద మానససరోజ విహారభృంగ
గంగాతరంగ ధవళాంగ రమాస్థితాంగ।
శృంగార (సుందర)సంగర కిరీట లసద్వరాంగ
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥

ప్రహ్లాదుని హృదయపద్మమున విహరించు తుమ్మెద యైనవాడవు, గంగాతరంగముల వలె తెల్లనైన అవయవములు కలవాడవు, వక్షమున వెలయు లక్ష్మి కలవాడవు, సౌందర్యమునకు దీటైన కిరీటము దాల్చి ప్రకాశించువాడవగు లక్ష్మీనృసింహస్వామీ! నాకు నీ చేయూత నిమ్ము.

నీవు ప్రహ్లాదుని హృదయములో భ్రమరమువై, తెల్లని వస్త్రములు ధరించి, వక్షమున లక్ష్మిని నిలిపి, మెరిసే కిరీటమును ధరించినవాడవు. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామీ నాకు చేయూతనిమ్ము.

ప్రహ్లాదుని మనఃకమలమందు విహరించు తుమ్మెదయైనవాడా! గంగనీటి వలె తెల్లనైన యొడలు గలవాడా! సుందరమైన కిరీటముచే అందమైన శిరస్సు గలవాడా! ఓ లక్ష్మీనృసింహ, నాకు చేయూత నిమ్ము.

23. శ్రీ శంకరాచార్యరచితం సతతం మనుష్యః
స్తోత్రం పఠేదిహ తు (సత్వ)సర్వగుణప్రసన్నమ్।
సద్యో విముక్త కలుషో మునివర్యగణ్యో
లక్ష్మీపతేః పద ముపైతి స నిర్మలాత్మా॥

ఏ నరుడు 'అన్ని గుణములతో కూడినది, శ్రీ శంకరాచార్యులచే రచింపబడినది' అగు ఈ స్తోత్రమును పఠించునో, అతడు వెంటనే పాపములు పోయినవాడై, ముని శ్రేష్ఠులచే మెచ్చబడదగినవాడై, పరిశుద్ధమగు అంతఃకరణము కలవాడై విష్ణువు యొక్క స్థానమగు శ్రీ వైకుంఠమును పొందుచున్నాడు.

శ్రీ శంకరాచార్యులచే రచించబడిన ఈ స్తోత్రమును ఎవరు పఠింతురో వారు పాపరహితులై, శుద్ధ అంతఃకరణ కలవారై విష్ణులోకమును పొందుదురు.

ఏ మానవుడు – శంకరాచార్యులు రచించిన ఈ ఉత్తమ స్తోత్రమును ఎల్లప్పుడు పారాయణము చేయునో – వాడా జన్మముననే, సమస్త పాపములను

విడిచి, యోగిపుంగవులచే మెప్పు వడసినవాడై, పవిత్ర స్వరూపము గలవాడై శాశ్వతమైన పునరావృత్తిలేని విష్ణు సాయుజ్యము పొందును.

24. యన్మాయ (యో)యార్జితవపుః ప్రచుర ప్రవాహ
మగ్నార్త మర్త్య నివహేషు కరావలంబమ్।
(మగ్నార్థ మత్ర నివహోరు కరావలంబం।)
లక్ష్మీనృసింహ చరణాబ్జ మధువ్రతేన
స్తోత్రం కృతం శుభకరం భువి శంకరేణ॥

ఈ పుడమి పై అజ్ఞానప్రాప్తమగు శరీరములను ధరించి, సంసారసాగరమున మునిగి తేలు మానవులకు చేయూతనిచ్చి సకల శుభముల నొసగు మధురమైన ఈ స్తోత్రమును, శ్రీ లక్ష్మీ నృసింహస్వామి పాదపద్మముల చెంత శ్రీ శంకరాచార్యుడు రచించినాడు.

అజ్ఞానులై, సంసార సాగరమున మునిగి తేలుచున్న జనులను ఉద్ధరించుటకు ఆది శంకరులచే ఈ స్తోత్రము రచించబడినది.

ఈ భూమియందు అజ్ఞానము వలన కలిగిన జన్మజన్మల పరంపరయందు మునిగి పీడితులైన మానవులకు చేయూత నిచ్చు శ్రీ లక్ష్మీనృసింహ చరనాబ్జములపై వ్రాలు తుమ్మెదవంటి వాడైన ఆది శంకరులచేత చేయబడినట్టిది ఈ స్తోత్రము. ఇది శుభములు కలిగించును.

25. శ్రీమన్నృసింహ విభవే గరుడధ్వజాయ
తాపత్రయోపశమనాయ భవౌషధాయ।
తృష్ణాది వృశ్చిక జలాగ్ని భుజంగ రోగ
క్లేశ(శా)వ్యయాయ హరయే గురవే నమస్తే॥

శ్రీ లక్ష్మీనృసింహస్వామీ! ప్రభుడవు, గరుడధ్వజుడవు, తాపత్రయహారుడవు, సంసారరోగమునకు ఔషధమైనవాడవు, తృష్ణాదులు - వృశ్చికాదులు - జలము - అగ్ని - సర్పములు - రోగముల వల్ల కలుగు క్లేశములు నివారించువాడవు, సన్మార్గ దర్శకుడవగు ఓ హరీ నీకు నా వందనము.

నీవు ఈ విశ్వమునకు ప్రభుడవై, సంసారమనే రోగమునకు ఔషధమై, అన్ని రోగములు, బాధలు హరించువాడవు. ఓ శ్రీహరీ నీకు వందనములు.

సమస్త జనుల తాపత్రయ ఉపశమన కారునికి, భవ రోగములను దూరము చేయు ఔషదమువంటి వానికి, తేలుకాటు, జలము, అగ్ని, పాముకాటు, దురాశ వంటి రోగాల వలన కలిగే క్లేశాలను పోగొట్టువానికి, హరునికి నాగురువైన గరుడధ్వజుడైన లక్ష్మీనృసింహునికి నమస్కరించు చున్నాను.

అధికపాఠం...

(యన్మాయ యోర్జితవపుః ప్రచురప్రవాహ
మగ్నార్థమత్ర నివహోరు కరావలంబమ్।)
లక్ష్మీ నృసింహచరణాబ్జమధువ్రతేన
స్తోత్రం కృతం శుభకరం భువి శంకరేణ।
యే తత్పఠంతి మనుజా హరిభక్తియుక్తాః-
స్తే యాంతి తత్పదసరోజమఖండరూపమ్॥

లక్ష్మీనరసింహుని పాదపద్మములందలి మకరందము నాస్వాదించు తుమ్మెద వంటివాడైన శంకరాచార్యునిచే ఈ స్తోత్రము రచించబడినది. ఏ మానవులు హరిభక్తులై ఈ స్తోత్రమును పఠించెదరో వారు అఖండ రూపమైన లక్ష్మీనరసింహుని పాదపద్మములను చేరెదరు.

// ఇతి శ్రీ లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రమ్ //

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)

Kiron Type Institute